నెలదాటినా శివలీల విచారం కించిత్ అయినా తగ్గలేదు. ఓ రోజు వాళ్ళింటికి వెళితే మొదటిరోజు చూసిన విచారం ఇంకా శివలీలలో కనబడింది నాకు ఆశ్చర్యపోయాను.

"పోయిన వాళ్ళంతా మంచివాళ్ళు...." ఓదార్చబోయాను.

"ఆ దేముడు నాకు అన్యాయం చేశాడు. నా మీద ఆయనకెంతో ప్రేమ. ఒక్క తాగుడు తప్ప ఆయనకి మరే చెడ్డ అలవాటులేదు. తాగుడుకి అలవాటుపడ బోయేముందు ఎలా వుండేవాడో ఆలోచిస్తే నా కడుపు తరుక్కుపోతుంది. మీకు తెలుసుగా చాలామంది గెస్ట్‌హౌస్‌లు తీసుకునేది స్త్రీ వ్యసనం వుంటే. కేవలం డ్రింక్సుకోసం ఆయన గెస్టుహౌస్ మెయిన్‌టెయిన్ చేశాడంటే ఎంత పిచ్చిమారాజో ఊహించండి. ఆ పిచ్చే వుంటే ఎప్పుడో విడాకులు తీసేసుకునేదాన్ని. ఆరోగ్యం పాడౌతుందని డ్రింక్స్ తగ్గించమనేదాన్ని. ఆయన ఎన్ని తిట్టినా, ఆయనకాదు, ఆయన రక్తంలోని ఆల్కహాల్ అని సరిపెట్టుకొనేదాన్ని. మర్నాడు నన్నలా తిట్టినందుకు ఎంతో సిగ్గుపడేవారు. కనీసం వక్కపొడి కూడా వేసుకోరు. ప్రతి రాత్రి కనిపిస్తుంది ఆయనలేని లోపం. తిట్లు తినికాని పడుకునేదాన్ని కాదు. ఇప్పుడేవీ ఆ తిట్లు? ఇప్పుడెవరున్నారు నన్ను తిట్టటానికి...."

శివలీల భోరున ఏడుస్తుంటే ఎవరో నా మనసు పిండినట్లుంది. శివలీల సరయిన భార్య అని కూడా అనిపించింది.

## టు - వే - టికెట్

చిత్రగుప్తుడు తన భూతద్దాల కళ్ళజోడులోంచి జాగ్రత్తగా చూస్తూ తన చిట్టాని తిరగేసి కైలాసం పాప పుణ్యాల పట్టికని వెదికి పట్టుకున్నాడు. హైద్రాబాద్‌లో ఆటో డ్రయివర్ అని తెగియగానే యమభటులని ఆజ్ఞాపించాడు.

"వీడిని రోడ్డురోలర్ క్రింద వందసంవత్సరములపాటు సాఫీ చెయ్యండి."

"పద" భుజం తట్టారు భటులు.

"ఎక్కడికి" అడిగాడు కైలాసం.

యమభటులు ఎక్కడికో చెప్పారు. కాని సరిగ్గా వినపడలేదు. కైలాసం అలవాటుగా "మీటర్ మీద రెండు రూపాయలివ్వాలి" అన్నాడు.

"మరో పది సంవత్సరాలు అదనం" చెప్పాడు బరువయిన గదని మోస్తున్న యముడు ఆ మాటలు వినగానే.

"నెక్స్ట్" అన్నాడు చిత్రగుప్తుడు

"ఇతని పేరు వుల్లాసం. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో వుంటాడు. హోటల్ యజమాని హోటలు పేరు...."

"తెలుసు. హైద్రాదాద్‌లో ప్రభుత్వం నిర్ణయించిన రేట్లకి నువ్వు టిఫిన్స్ అమ్మావా?" అడిగాడు చిత్రగుప్తుడు.

"తప్పదుగా చిత్తం" చెప్పాడు వుల్లాసం.

"హైద్రాబాద్‌లో ఏ హోటలు వాళ్ళు ప్రభుత్వం నిర్దేశించినట్లు రుచిగా, సుచిగా పదారాలు సప్లయ్ చేయలేదు. వెయ్యి సంవత్సరాలు కాగే నూనెలో పడబెట్టండి."

* * * *

సరిగ్గా ఆ సమయంలో ఆఫీస్‌నించి రోజుకన్నా తొందరగా ఇంటికి చేరుకున్నాడు శివనాథ్. కాలింగ్‌బెల్ నొక్కిన ఐదు నిమిషాలకి శివనాథ్ భార్య తలుపు తెరచింది భర్తని చూసి ఆశ్చర్యంతో కూడిన సంతోషం నటిస్తూ "రండి రండి అబ్బ ఎంత తొందరగా వచ్చారు" అన్నది.

శివనాథ్‌కి వివాహం అయి ఆరునెలలు కూడా కాలేదు. అప్పుడే భార్య మీద అరవై సార్లు అనుమాన పడ్డాడు పెళ్ళికి పూర్వం ఆమెకో ప్రేమ వ్యవహారం వుందని, ఆ ప్రియుడు బృహస్పతి అని, అతనితో తన భార్య ఇంకా వ్యవహారం సాగిస్తోందని శివనాథ్ అనుమానించటంలో అతని తప్పులేదు.

"ఎవరో వున్నట్లున్నారే?" అడిగాడు ఓరగా చూస్తూ.

"అబ్బే ఎవరూ లేరు."

శివనాధ్ ముందు గది పరకాయించి చూసి మధ్య గదిలోకి వెళ్ళాడు ఆ గది బీరువా తలుపు తెరచి చూశాడు. బీరువా వెనక గోడకి వున్న ఖాళీ మధ్య చూశాడు సోఫా కింద చూశాడు. పడక గదిలోకి వెళ్ళి మంచం కింద, వార్డు రోబ్ తలుపు తెరచి చూశాడు. వంటగదిలోకి వెళ్ళి వంటకోసం కట్టించిన ప్లాట్‌ఫాం కింద, అటక మీద కూడా చూశాడు.

ఎక్కడా లేడు బృహస్పతి. ఏమైనట్లు తనే స్వయంగా చూశాడు వాడు ఇంట్లోకి వెళ్ళటం.

"ఎక్కడ దాచావ్?" గద్దించాడు.

"నేనెవరినీ దాయలేదు."

బాల్కనీలోకి వెళ్ళాడు. అక్కడా లేడు. చిత్రం. ఇంట్లో ఎక్కడా లేకుండా ఎలా మాయమయ్యాడు? తొంగి క్రిందకి చూశాడు. షర్టుబటన్‌లు పెట్టుకుంటూ, గబగబా నడిచే ఓ వ్యక్తి శివనాధ్ కంటపడ్డాడు.

అతని కోపం పదిరెట్లు పెరిగింది. ఆ కోపంలో ఏం చేస్తున్నాడో కూడా ఆలోచించకుండా వుద్రేకంగా ఒక్క అంగలో హాల్లోని విడిచినబట్టలు వేసే చెక్క పెట్టెను బలంగా ఎత్తి మళ్ళీ బాల్కనీలోకి వచ్చి ఆ వ్యక్తి మీద విసిరాడు అది మీద పడ్డతను చిన్న కేకకూడా వేయకుండా తిన్నగా యమలోకం చేరుకున్నాడు.

o o o o

"నీ పేరు శకేశ్వర్ కదూ?" అడిగాడు చిత్రగుప్తుడు అతన్ని.

"అవును మీరెవరు? నేనిక్కడికి ఎలా వచ్చాను?"

"నీ ఆయువు మూడి. రెండు నెలలు నరకంలో వుండి ఆ తర్వాత నీవు పండేళ్ళు స్వర్గంలోకి వెళతావు" చెప్పాడు చిత్రగుప్తుడు ఆ జెయిలర్ రాకమునుపే అతని జాతకం యావత్తు క్షుణ్ణంగా పరిశీలించి అతని కోసం

ఎదురు చూస్తున్నాడు యమభటులు శక్తేశ్వర్‌ని తీసుకెళ్ళి మరోవ్యక్తిని ప్రవేశపెట్టారు

"నీ పేరు?" అడిగాడు చిత్రగుప్తుడు కొద్దిగా ఆశ్చర్యంగా.

"బృహస్పతి"

చిత్రగుప్తుడు చిట్టాతిరగేసి "నీవు ఇంకా ముప్ఫై రెండేళ్ళ బ్రతకాలి ఎలావచ్చావ్?" అడిగాడు.

"శక్తేశ్వర్ వెంట వచ్చాను"

"శక్తేశ్వర్ చొక్కాగుండీలు పెట్టుకుంటూ నడుస్తుంటే నెత్తి మీద చెక్కపెట్టె పడి మరణించి రావాలని రాసివుంది. నువ్వు గుండె జబ్బుతో మరణించాలి. ఇదెలా సంభవం?" అడిగాడు చిత్రగుప్తుడు ఆలోచనగా. "నేనా చెక్కపెట్టెలో వున్నాను" చెప్పాడు బృహస్పతి. జరిగిన పొరపాటుని సరిదిద్దుకున్నారు యమభటులు.

* * * *

హాస్పిటల్‌లో బృహస్పతికి తెలివొచ్చింది. శివనాధ్ భార్యనుచూసి బలహీనంగా నవ్వి చెప్పాడు.

"త్వరలో మీ ఆయన్ని వురితీయటం జరుగుతుంది."

"నీ కెలా తెలుసు?" అడిగింది ఆమె.

"స్వయాన చిత్రగుప్తుడే చెప్పాడు" బృహస్పతి సంతోషంగా నవ్వుతూ చెప్పాడు.

# తెలివయిన భార్య

నాతో పాటే వాళ్ళు గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌లో, అదే కంపార్ట్‌మెంట్‌లో వచ్చారు. ఆమె వయస్సు ముప్ఫై-ముప్ఫై రెండు మధ్య వుంటుంది. చూడగానే "చక్కని గృహిణి" అనే భావం కలిగేలా వుంది.